కథానిక

# పార్వతి తపస్సు

"మూర్తిశ్రీ"

ప్రపంచంలో ఏ వ్యక్తీ జీవిత శిఖరాలను అధిష్ఠించి అక్కడే ఉండిపోలేదు. లేక ఏవ్యక్తీ తన జీవితం చివరవరకూ హీనంగా గడుపలేదు. అందుకే జీవితంలో నిమ్నోన్నతాలు సహజం. అలాంటిదే నా జీవితం కూడాను. ఏ రసానికి ఆహుతి కావడమో అర్థంకాక, యిలాగ నా విలువలేని జీవితం గడుపుతున్నాను.

మా అమ్మ నాకు ఆరు సంవత్సరాలు వచ్చేటప్పటికి చనిపోయింది. నాకు మా నాన్న బ్రతికి ఉన్నా చనిపోయినట్లే లెక్క. ఆతను మా అమ్మను వదిలేశాడు. దానికి ప్రబలమైన కారణం లేకపోయినా, మాఅమ్మ శీలాన్ని శంకించి వదిలేశాడు. వివాహమైన రెండు సంవత్సరాలవరకూ యిరువురూ చాలా అన్యోన్యంగా ఉండేవారట. మూడవ సంవత్సరాంతంలో మాఅమ్మ మేనమామ కుమారుడు తరుచు మా యింటికి వచ్చేవాడట. అసలు ముందు మా అమ్మని అతనికే యిద్దామనుకున్నారు. కాని కారణాంతరాలవల్ల వివాహం ఆగిపోయింది. అందుచేత అతని రాక మా నాన్నగారికి అనుమానానికి కారణం అయింది. నాన్నగారి కన్నా యింతో అంతో అందమయినవాడు. క్రమంగా అతడు రెండు మూడు రోజులు మా యింట్లోనే ఉండిపోవడం జరిగింది. నాన్న ఏమీ అనలేకపోయేవారు. ఒకనాటి రాత్రి నాన్న ఎవరితోనూ చెప్పకుండా ఎక్కడికో వెళ్లి పోయారు. అప్పటికి నేను మాఅమ్మ కడుపులో ఉన్నాను. అందుచేత నేను మాయింటి ప్రక్కాయన దయవలన పెరిగాను. అతను నన్ను కన్న కూతురికన్నా గారాబంగా పెంచారు. పల్లెటూరిలో పెద్ద చదువు లేకపోయినా ముఖర్జీ మహాశయుని బడిలో చదివాను. తీరా పన్నెండో ఏడు వచ్చేసరికి పుష్పవతినై కూర్చున్నాను. అక్కడ పెద్ద చదువు లేనూలేదు. నన్ను యింకా చదివించడానికి వారికి యిష్టంలేదు. అందుచేత చదువు మాన్పించారు.

నన్ను పెంచిన వ్యక్తికి నాకు వివాహం చేయడానికి అధికారం ఉన్నాది. ఆఖరికి ఒక ముప్ఫయి సంవత్సరాలున్న ఒకాయన కిచ్చి వివాహం చేశారు. తర్వాత ఆయన చెప్పారు. నన్ను కొనుక్కున్నారుట. నాభర్తకూడా ఏమంత ధనవంతుడు కాడు. మేమున్న పల్లెలోనే అతనికి ఆరెకరాల పల్లం పదెకరాల మెట్టభూమి ఉన్నాయి. తన స్వంత పెంకుటిల్లు ఒకటి ఉన్నది.

ఆ యింట్లోనే తరచు తన స్నేహితులందరినీ తీసుకొనివచ్చి భోజనాలు పెట్టేవాడు. మొదట్లో కొత్త అవడంచేత జాగ్రత్తగా వండలేక పోయేదాన్ని. బాగున్ననాడు నన్నెంతో పొగడేవాడు. బాగులేనినాడు తిట్టేవాడు. నాచేత అప్పుడప్పుడు పాడించేవాడు. బాగా పాడలేక ఎంతో గాభరా, ఆవేశం పడి పోయేదాన్ని. బాగున్ననాడు నన్నెంతో పొగడేవాడు లేని నాడు వారి ముందరే నన్ను చితగ మొత్తేవాడు. కాని భర్తగదా! ఎలాగున చెబితే అలాగున నడుచుకోవాలి. నాకు మూర్ఛ వచ్చేది. నన్ను జంతువుకన్నా కనికిష్టంగా ఒక గదిలో పడవేసి తలుపువేసి ఎక్కడికో వెళ్ళిపోయేవాడు. రాత్రి వచ్చి నన్ను విడవడమే కాకుండా, నాకు మిఠాయి తెచ్చి యిచ్చి, పగలు బాధపెట్టినందుకు క్షమించమని నన్ను కౌగిలిలో బంధించేవాడు.

ఒకొక్కప్పుడు రాత్రంతా ఎక్కడికో వెళ్ళి ఉదయాన్నే యింటికి వచ్చేవాడు. సాధారణంగా అటువంటి సమయంలో నవ్వుతూ ఉండేవాడు. నేను అతని జేబు జాగ్రత్తగా చూచేదాన్ని. ఎన్నో బంగారపు కాసులు! ఇన్ని ఎక్కడివా అని ఆశ్చర్యపోయేదాన్ని. ఎక్కడివి

అని అడిగినా ఒళ్ళు హూనం అయిందన్న మాటే!

ఒకనాడు రాత్రి ఎవరో ఒకాయన కాకీ బట్టలు వేసుకొని వచ్చారు. మా యింటిప్రక్కన ఉంటున్న మునసబుగారుకూడా ఉన్నారు. ఎవరంటే పోలీసు సబిన్స్పెక్టర్ అన్నారు. నా గుండెలు గబగబ కొట్టుకున్నాయి. వెంటనే అతడు రెండు స్థలాలలో త్రవ్వేసరికి ఒకదగ్గర బంగారపు కాసులు, రూపాయలు ఉన్నాయి. నా కళ్లు జిగేల్ మన్నాయి. ఇవన్నీ ఎక్కడివని నన్ను ప్రశ్నించారు. నాకు తెలియదని నిర్భయంగా చెప్పాను. మునసబుగారుకూడా అలాగే అన్నారు. నా భర్త గురించి అడిగారు. అతను ఎక్కడికి వెళ్ళాడో తెలియదన్నాను. 'అయితే అతను దొరికేవరకు నిన్ను నిర్బంధంలో ఉంచుతా'మని అన్నాడు. కాని కరణంగారు, మునసబుగారు, భర్త తప్పుకి భార్యని హింసించడం తప్పని, నన్ను జామీనుపై విడుదల చేయించారు.

నా భర్త ఎక్కడికి వెళ్ళాడో దైవానికే తెలియాలి. ఆఖరి రోజున న్యాయస్థానపు టూవరణంలో ఉన్న యువకులను చూస్తే నాకే అసహ్యం వేసింది. అంత నాపై అభిమానం ఉన్నట్లు ఎన్నో ప్రశ్నలు వేశారు కాని ఆ అభిమానం ఎటువంటిదో నాకు తెలుసును. ఒక్క యువకుడైనా నాకు న్యాయం యిప్పించడానికి పాటుపడుతాడా! అయినా నేను బీద దాన్ని. న్యాయం ఏనాడో ధనికులకి బానిస అయిపోయింది.

ఇంతట్లోకి ఒక ముసలివ్యక్తి నాదగ్గరకు వచ్చి ఆరోజుమట్టుకి తనయింటిలో భోజనం చేయమని ప్రాధేయపడ్డది. ఆమె చేసిన ఈ చిన్న ఉపకారానికి పేదవానికి అమృతభాండం దొరికినంతగా ఆనందించాను. సరేనని ఆమెతో వారింటికి వెళ్ళాను. వారిల్లు చాలా అందమైనది. ఇంటి వెనుకభాగాన్ని ఒక చిన్న పూలతోట. వారి యింటి ముందర ఒక పంజరంలో మూడు రామచిలుకలున్నాయి. 'పాపం వాటికి స్వేచ్ఛ నీయకుండా తమ సౌకర్యంకోసం ఉపయోగించుకుంటున్నా' రనుకున్నాను. అలాగే పురుషుడు స్త్రీస్వేచ్ఛ నరికట్టి, ఆమెని తన సౌఖ్యంకోసం ఉపయోగిస్తాడు గదా అనిపించింది.

నాకన్న చిన్నవారయిన ఆమె ముగ్గురు బిడ్డలు చాలా అందమయినవారు. నన్ను తీసుకొనివెళ్ళి వారితో ఆ ముసలావిడ 'యిదిగో! ఈమెను ఈనాటినుండి మీ చెల్లెలుగా, పొరపాటు, అక్కగా భావించి, ఆదరించి, ప్రేమించండి' అన్నది. ఆమె నాకు భోజనం పెట్టి, విశ్రాంతి తీసుకోమన్నాది. నేను మంచంమీద మేనువాల్చాను. గాఢంగా నిద్రపోయాను.

నేను లేచేసరికి అప్పుడే చీకటిపడ్డాది. ముసలావిడ నాదగ్గరకు వచ్చి 'నీవు చాలాసేపు నిద్రపోయావు. ఇంద ఈపాలు త్రాగు' అని గాజు గ్లాసుతో వేడిపాలు యిచ్చింది. ఆమె వాత్సల్యానికి ఎలాగ కృతజ్ఞత చూపాలో తెలియలేదు. నేనామెతో అన్నాను.

'మీ అనురాగానికి నా వందనాలు.'

'ఈమాత్రందానికేనా అమ్మా.'

'సరే. ఇంక శలవ్.'

'ఎక్కడికి?'

'మా పల్లెకి.'

'ఇంతరాత్రప్పుడా? బాగున్నాది. అయినా మీవారంతా నిన్ను వదిలేసి పొద్దున్నే వెళ్ళిపోయారు. వారిని పట్టుకొని ఎందుకమ్మా దేవులాడుతావు? నామాటవిను, కన్నకూతురులాగ చూసుకుంటాను. అయ్యో! నా మతిమండ! ఉండు' అని మళ్ళీ కాఫీ యిచ్చింది. తాగేశాను.

'అయితే ఒక కేసు గురించి వచ్చావన్న మాట?'

'అవును. నాకు దొంగతనం అంటగట్టబడింది. నాభర్తకి బదులు నన్ను పట్టుకున్నారు.'

'నీభర్త ఎక్కడున్నాడు?'

'పారిపోయాడు.'

'మరి నీ తల్లిదండ్రులు?'

'లేరు. చిన్నప్పుడే తల్లి చనిపోయింది. తండ్రి వదిలేశాడు.'

'అయితే నీవు ఎవరింటో ఉన్నావు.'

'మునసబుగారి భార్య దయవలన వారింటనే ఉన్నాను.'

'వంటలక్కగానా?'

'అవును.'

'నీకేమాత్రం జీతం యిస్తారు?'

'ఏమీ ఇవ్వరు. అన్నం పెడతారు. న్యాయంకోసం నా తరఫున పనిచేస్తున్నా' రన్నాను.

'పిచ్చిపిల్లా! ఎంతకాలం యితర్లపయిన ఆధారపడతావు? ఏదయినా ఉద్యోగం చేసి డబ్బు ఆర్జించుకో.'

'ఉద్యోగం! ఓనమాలు రాని నాకా ఉద్యోగం? ఎవరిస్తారు?'

ఓ! పట్నంలో ఉద్యోగాలే ఉండవా? అనుభవం వలన తెల్సుకుంటావు. ఇంతకీ నేర్చుకుందికి కుతూహలం ఉండాలి. చేయడానికి మనస్సుండాలి.'

నేను మాట్లాడకుండా ఊరుకున్నాను.

'ప్రస్తుతం మాయింట్లో కూడా ఒక మనిషి కావాల్సిఉన్నాది. నాముగ్గురి బిడ్డలకూ ఒక పరిచారిక కావాలి. అంటే వారిక్రింద చాకిరీ చేయనక్కరలేదులే.. కాని వారితో ఉదయం, సాయంకాలం వీధిలోనికి వెళ్ళాలి. నెలకు యిరవై రూపాయిల్లు యిస్తాను' అని నా కాశ చూపింది.

నిజానికి ఈ విషయం నాలోని ఎంతో ఆశ రేకెత్తించింది. చీకటికొట్టు అయిన నా భావి జీవితంలో ఆశ మెరపు మెరసినట్లయింది. సరే నన్నాను.

నాకు ప్రత్యేకంగా ఒక గది యిచ్చారు. ఆ గదినిండా అన్నీ పటాలు. అన్నీ శృంగార ప్రబోధకంగాను, తీయని కోర్కెలను రేపెట్టేవిగాను ఉన్నాయి. గదిలో అలంకరించిన చక్కటి పందిరిమంచం ఉన్నది. ఖరీదు సోఫాలున్నాయి. నాకు ఆశ్చర్యం వేసింది. ఇంట్లో మొగవారెవరూ లేరుగదా యింత హాయిగా జీవితం ఎట్లా గడుపుతున్నారా అని పించింది.

వారి అలంకరణ చూస్తే నాకు చాలా ఆశ్చర్యం, అసహ్యం వేసేది. అందులో వారి పెద్దమ్మాయి- నాకన్నా వయస్సులో ఒక సంవత్సరం చిన్న- మరీ విలాసంగా అలంకరించుకొనేది. పవిట సమంగా వేసుకొనేదిగాదు. ఎవరైనా మొగాళ్ళు వచ్చినా అలాగే ఉండేది. వారెప్పుడూ నీచంగా మాట్లాడేవారు. వారు పాడే పాటలన్నీ శృంగారమయం.

కాని నావిషయంలో సామెత నిజమయింది. ఆరు వారాలలో నేనూ వారిలాగే అలంకరించుకోవటం, వారి సంభాషణలో పాల్గొనటం నేర్చుకున్నాను. ఒకనాడు నేను ముసలావిడతో మాట్లాడుతూ ఉంటే ఆవిడ—

'నీవు నీ చూపులను అభివృద్ధి పరచావా తప్పకుండా ఈ ఊరిలో అందరికన్నా గొప్పదానివై పోతావు.'

'చూపులవలన లాభం ఏమిటి?'

'ఏమిటా! ఒక సొగసుగాడయిన స్నేహితుణ్ణి సంపాదించ గలవు.'

నేను ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచేను.

'అయినా నీభర్త జీవించి ఉన్నాడని నమ్మకము ఏమిటి? ఆ విధంగా పారిపోయినవారు ఆత్మహత్య చేసుకుంటారు'.

'అమ్మయ్యో!' భయంగా అన్నాను.

'పిచ్చిపిల్లా! ఈ జీవితాన్ని, స్వర్గధామం గాను, నరకంగాను మనంతట మనమే చేసుకుంటాం. ఈ జీవితం నీ పూర్వపు జీవితంకన్నా ఎన్ని రెట్లు గొప్పో ఆలోచించు. సుఖమయం, రసమయం చేసుకున్న మాలాంటి వారికి స్వర్గం. నీ లాంటి వారికి నరక ప్రాయం.'

ఒకనాడు పేపరు చదివి ఎవరో ఒకవ్యక్తి 'పార్వతి అన్న తనభార్యని విడిచిపెట్టి, పోలీసు వారికి భయపడిపారిపోయాడని, అతను ఆరోజు రైలులోనుంచి గెంతి చనిపోయాడని చెప్పింది. ఆ వ్యక్తి పేరులేదు. 'పార్వతి' మాత్రం నేనే. ఆ క్షణంలో నా భర్త ఆత్మ శాంతికోసం ప్రార్థించాను. ఒకనాడు మాయింటికి ఒక రైల్వే గార్డు వచ్చాడు. ఆనాడు నా భర్త గెంతిన రైలుకు యితనే గార్డట. నా సందేహాలన్నీ అడిగాను. అతను చెప్పాడు. నాకు సందేహం తీరిపోయింది. నా భర్త చనిపోతూ ఏమిటి చెప్పాడని అడిగాను. గార్డు 'నా అందమయిన భార్యని చాలాబాధించాను. నా మరణానంతరం ఆమెని వివాహం చేసుకోమనండి. పార్వతి పిచ్చిపిల్ల' అన్నాడని చెప్పాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. నా భర్త వంటి కఠిన హృదయుండు యిలాంటి సున్నితమైన,

దూరాలోచనగల ఉపన్యాసం యిచ్చాడంటే ఆకస్మాత్తుగా నా కండ్లనుండి రెండు అశ్రుబిందువులు రాలేయి.

నాతో నేనే తర్కించుకున్నాను. నా భర్త చనిపోయాడు. అంటే నేను 'విధవ'నన్నమాట. నిజానికి నన్ను యిచ్చి వివాహం చేసింది సామాన్య పురుషునికిగాదు. అతనికి 'సౌఖ్యం' కన్నా ఎక్కువగా కావల్సినది తననీ తనస్నేహితులనీ, విందులతో సుఖపెట్టడం! కానియిప్పుడు నా వయస్సు యిరవై సంవత్సరాలు. వివాహం అవకపూర్వం పడే విరహవేదనకన్నా, వివాహం అయిన తర్వాత, కొంతకాలం సుఖం మరిగిన తర్వాత పడే వేదన కోటిరెట్లు ఎక్కువ.

ఒకనాడు ముసలావిడ నన్ను తన గదిలోనికి రమ్మని వారింటిలో వ్యాపార పారం చెప్పింది.

'ఈ ప్రపంచం అందమయిన విధవ స్త్రీ గూర్చి ఏమంటుందో తెలుసా.'

'ఏమంటుంది?'

'కులట అంటుంది. ఈ అపవాదుకన్నా వివాహం చేసుకోరాదూ?'

ఒక క్షణం ఊరుకొని మొదలెట్టింది.

'నా దృష్టిలో ఒక డాక్టరున్నాడు. అతని భార్య చనిపోయింది. పిల్లలు లేరు. అతను పునర్వివాహ ప్రయత్నంలో ఉన్నాడు. చాలా డబ్బున్నది. మీరు పరస్పరం చూసుకొని ప్రేమించుకొని, వివాహం చేసుకొనవచ్చును. మీ వివాహానికి నేను సర్వ సన్నాహాలు పూర్తి చేస్తా'నన్నది.

నా ముఖం బట్టి నేను ఒప్పుకున్నట్టు గ్రహించింది.

'సరే నాతో డాక్టరు యింటికి రా' అని నా అలంకారమంతా పూర్తి చేసింది. మేము డాక్టరింటికి వెళ్లాము. డాక్టరు తీక్షణంగా చూశాడు. ఆ చూపు నా గుండెల్లోకి దూసుకుపోయింది.

మా యిరువురి భావి జీవితంగూర్చి నేనాలోచించాను. కాని చిట్టచివరకు నాకు నైతికపతనం తప్పిందికాదు. డాక్టర్ ఒక శుభ ముహూర్తాన నన్ను చేపట్టేడు. ఆనాడు, అంటే మొదటి రాత్రి, డాక్టర్ నా కండ్లలోకి చూచి నన్ను తన బాహువుల్లో బంధిస్తూ ఉంటే 'ఆయన' జ్ఞప్తికి వచ్చారు. కాని నెట్టుకొస్తున్న 'ఉద్రేకం' ఆయన్ని మరపించింది.

క్రమేపీ నేనే డాక్టర్, డాక్టరే నేనుగా మెలగేవారం. ఒకనాడు ఒక వ్యక్తి ఆపరేషన్‌కి వచ్చాడు. ఆనాడు వార్డులో మా ఆయన డ్యూటీ. అందుచేత, ఆపరేషన్ చేయవల్సిన బాధ్యత నా భర్తపై బడింది. ఆపరేషన్ మొదలెట్టే వేళకి ఆ వచ్చిన వ్యక్తి తనకొక అందమైన భార్య ఉండేదని ఆమెకి తాను జీవితాంతం కృతజ్ఞత చూపాలని అన్నాడు. తాను దొంగతనంగా ఎంతో ధనం ఆర్జించాడనీ ఆ ధనం తన దగ్గర ఉన్న సంగతి పోలీసులకి తెలిసి తనను పట్టుకొనడానికి వస్తే పారిపోయావనీ చెప్పాడు. ఆ సంగతివచ్చి నా భర్త చెప్పాడు. నా గుండె గబగబ కొట్టుకున్నాది. నా భర్త కాబోల్సు!

నేను డాక్టర్‌తో ఆస్పత్రికి వెళ్ళాను. అతను నా భర్తే... నా గుండె ఆగినంత పని అయింది. నన్ను చూడటంవలన తన జన్మ తరించినదని అన్నాడు. డాక్టర్‌కి ఈ సంగతి తెలిసి చాలా ఖిన్నుడయాడు. కత్తి తీసుకొని ఆపరేషన్ ప్రారంభించాడు. డాక్టర్ చాలా విశాల హృదయుడు. ఎందుచేతనంటే డాక్టర్ తల్చుకుంటే ఆక్షణంలో నా భర్తను చంపగలడు. కాని ఆపరేషన్ బాగా చేశాడు. అతని నయనాలు అశ్రుపూరితమయాయి. 'పారూ... ఈతని జీవితం నాశనమయిందంటే నా జీవితం నాశనం అయిందన్న మాట.' ఆ మాట విని నేనూ ఏడ్చాను. ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తి లేచాడు.

'పారూ......ఎందుకు మీరిరువురూ ఏడుస్తున్నా'రన్నాడు డాక్టర్. అంతా చెప్పాడు.

'అలాగా! నేను మధ్యవాణ్ణి. సరే. పారూ! క్షేమంగా ఉండు. డాక్టర్‌జీ ఆపరేషన్ విజయవంతంగా చేసినందుకు ధన్యవాదాలు' అని ఆపరేషన్ కత్తితో పొడుచుకున్నాడు.

'ఆ...ఆ...'అన్నాను.

'ఊరుకో! నీ విలాంటి పని చేసిన తర్వాత ఎలాగ నన్ను నేను భస్మం చేసుకోగలను... యింక జీవించగలనా?'

నేను ఏ రకానికి ఆహుతి కావాలో అర్థం కాలేదు.

(ఒక ఆంగ్లకథకి అనుసరణ)